క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో అర్చకులు, భక్తులు

తుక్కుగూడ: పురపాలక పరిధి మంఖాల్(ఈ–సిటీ) శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగ సమేత శ్రీ బాలజీ వేంకటేశ్వర స్వామి తిరుకల్యాణ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించారు. శ్రీవారి దంపతులను రథంపై ఉంచి ఆలయ మాఢ విధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తాగునీటి వసతి, భోజనం తూళ్ల వీరేందర్‌గౌడ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు శేషం జగన్నాథ చార్యులు, శేషం సింహ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్ కృషితోనే.. ఈ గౌరవం





మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రశాంత్‌కుమార్, సురేందర్

కందుకూరు: మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా తమను ఎంపిక చేయడం కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నామని కందుకూరుకు చెందిన బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, ఆకులమైలారానికి చెందిన అండేకార్ సురేందర్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. తమకు ఈ పదవులు రావడానికి మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ కృషి ఎంతో ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రాధాన్యమిస్తుందనడానికి ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్, మండల నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ రాజునాయక్, తండావాసులు

మహేశ్వరం: తండాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా తాము నిరంతరం పని చేస్తామని మాజీ సర్పంచ్ మెఘావత్ రాజునాయక్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నాగులోని తండాలో ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాల్లోని ప్రతీ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు ప్రతీ ఇంటికి తాగు నీరు, వీధి దీపాలకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. తండాల్లో సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే సబితా రెడ్డి సహకారంతో తండాలను మరింత అభివృద్ధి చేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

శిథిల భవనాన్ని కూల్చివేయాలని వినతి



డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, స్థానికులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని చాడీ వద్దగల పురాతన భవనాన్ని కూల్చివేయాలని సరూర్‌నగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాతకు గురువారం కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి వినతిపత్రం అందజేశారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా డిప్యూటీ కమిషనర్‌తో కార్పొరేటర్ కూలిపోయే దశలో ఉన్న భవనాన్ని సందర్శించారు. 95శాతం ప్రజలు కూల్చివేయాలని కోరుతున్నారని డిప్యూటీ కమిషనర్ దృష్టికి కార్పొరేటర్ తెచ్చారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. భవనంతో ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, గతంలో హోమ్‌లెస్ మహిళలకు షెల్టర్ ఏర్పాటు చేశారని, ప్రస్తుతం స్వచ్ఛంద సంస్థ ఓల్డేజ్ హోం నిర్వహిస్తోందన్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేయక తప్పదన్నారు. తక్షణమే ఆ భవనాన్ని తొలగించి చౌరస్తాను సుందరీకరణ చేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో డీఈ చందన, నాయకులు బేర బాలకిషన్, దేవేందర్, దశరథ, జైన్‌బాబు ఉన్నారు.

హోలీ వేడుకలకు ‘జల్‌పల్లి’ సిద్ధం

- నిజాం నవాబును ఆకర్షించిన అమీర్‌బాయి
- ఆమె జ్ఞాపకార్థంగా సంబురాలు
- జాతరకు తరలివస్తున్న నక్కల పిట్టల కుటుంబాలు


పహాడీషరీఫ్: రంగుల హరివిల్లు హోలీ వేడుకలకు జల్‌పల్లి పిట్టల గూడెం సిద్ధమయింది. తెలంగాణ జిల్లాలతో పాటు నగరంలోని అన్ని పార్ధివాడలకు చెందిన ‘నక్కల పిట్టలోల్లు ఇక్కడ హోలీ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కుటుంబంతో సహా.. నాలుగు రోజుల పాటు ఇక్కడే సంబురాలు చేసుకుంటారు. దీంతో ఈ ప్రాంతమంతా జన జాతరను తలపిస్తుంది. ఈ నెల 14 నుంచి వేడుకలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఇప్పటికే పార్ధిలు పిట్టల గూడెంలో తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. తమ పూర్వీకుల సమాదులకు రంగులు వేశారు. ఈ వేడుకల్లో తమ అరాధ్య దైవాలు, కుల యువతి అమీర్‌బాయి సమాధికి పూజలు చేయనున్నారు.

వంశపూజే ప్రధాన ఘట్టం

వంశపూజలు చేయడం ఈ హోలీ వేడుకల్లో ప్రధాన ఘట్టంగా చెప్పుకోవచ్చు. హోలీకి ముందు రోజు రాత్రి కాముని దహనం చేస్తారు. హోలీ రోజున రంగులు చల్లుకుని స్థానిక జల్‌పల్లి పెద్ద చెరువులో స్నానాలు ఆచరిస్తారు. నక్కల పిట్టలోల్ల కులంలోని శక్తి, చౌకట్, నౌకడ్, కాలివాలా, ఇస్లీవాలా తదితర వంశాల ప్రజలే అధికంగా ఉంటారు. వీరంతా ఇక్కడే వంశపూజ నిర్వహిస్తారు. ఈ వంశపూజలో ఒక్కో కుటుంబం నాలుగైదు పొట్టేళ్లను బలిచ్చి వేడుకలు జరుపుకొంటారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పహాడీషరీఫ్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో నీరు, విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటారు.



హోలీ వేడుకల్లో పాల్గొన్న పార్ధీలు(ఫైల్)



అమీర్‌బాయి స్నానాల కోసం నిజాం నవాబు నిర్మించిన కొలను

నవాబును ఆకర్షించిన యువతి..

ఉత్తరాది రాష్ట్రాల నుంచి నిజాం నవాబుల హయాంలో వలస వచ్చిన నక్కల పిట్టలోల్లు జల్‌పల్లి గ్రామ అటవీ ప్రాంతంలో కుందేళ్లు, పక్షుల వేట వృత్తిని కొనసాగిస్తూ జీవనం కొనసాగించేవారు. ఆ సమయంలో వేట కోసం వచ్చిన నిజాం నవాబుకు ఈ తెగకు చెందిన అమీర్ బాయి అనే యువతి తీయని ఫలాలను అందజేసింది. ఆ ఫలాలను ఆస్వాదించిన నిజాం నవాబు.. ఆమె ప్రేమను కోరాడు. దీనికి ఆమె అంగీకరించిన నేపథ్యంలో.. నాటి నుంచి నిజాం నవాబుకు నక్కల పిట్టలోల్లు పండ్లను అందజేస్తున్నారు. పండ్ల వృత్తిని కొనసాగిస్తున్నామని కుల పెద్దలు పేర్కొంటున్నారు.

ప్రాచీన చరిత్ర

దశాబ్దాల క్రితం వరకు జల్‌పల్లి పిట్టలగూడెం ప్రజలతో కళకళలాడేది. ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొని స్థానికంగా తోటలలో సీతాఫలాలతో పాటు ఇతర పండ్లను పండించేవారు. కాల క్రమేణా ఇక్కడి నుంచి ఒక్కొక్కరుగా నగరానికి చేరుకున్నారు. వివిధ ప్రాంతాల్లో పార్ధివాడలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిన వారు.. పాతబస్తీ, పురానాపూల్, లాల్‌దర్వాజా, రాజన్నబావి, శంషీర్‌గంజ్, ఛత్రినాక హమాం బౌలి, డబీర్‌పూర, సరూర్‌నగర్, కాచిగూడ, అమీర్‌పేట, ఆబిడ్స్, బేగం బజార్, బోయిగూడ, చిక్కడపల్లి, ఎల్.బి.నగర్, మోజంజాహి మార్కెట్, గన్‌ఫౌండ్రీ, వరంగల్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. ఇప్పటికీ ఆయా కుటుంబాల్లో ఎవరు మృతి చెందినా జల్‌పల్లి పిట్టల గూడెంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిస్తారు.



అమీర్‌బాయి సమాధి

వందల ఎకరాల భూమి ఇనాం

అమీర్‌బాయి స్నానమాచరించడానికి నిజాం నవాబు.. కొలను తవ్వించారు. భూగర్భంలోనే రాతి కట్టడంతో స్నానాల గదులను నిర్మించాడు. 40 ఏళ్ల లోపే ఆమె మృతి చెందడంతో.. కొలన్‌కు సమీపంలోనే ముస్లిం, పార్ధిల సంప్రదాయం ప్రకారం ఆమె అంత్యక్రియలు చేసి, సమాధి నిర్మించారు. ఇక్కడే నక్కల పిట్టలొల్లు నివాసం ఉండేందుకు అప్పట్లో నిజాం నవాబు వందల ఎకరాల భూమిని ఇనామ్‌గా ఇచ్చారు. నాటి నుంచి ఏటా ఇక్కడ హోలీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. హోలీ మరుసటి రోజు అమీర్‌బాయి సమాధి వద్ద ఈ కులస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.

అమీర్‌బాయి పేరు మీదుగానే



హోలీ వేడుకలు ఏటా పిట్టలగూడెంలో జరుపుకొంటాం. మూడు రోజుల ముందే ఇంటిల్లిపాది ఇక్కడికి చేరుకుని గుడారాలు ఏర్పాటు చేసుకుంటాం. తమ పూర్వీకుల సమాదులను అలంకరించుకుంటాం. అన్నింటి కంటే ఈ పండుగనే ఘనంగా జరుపుకొంటాం. అమీర్‌బాయి పేరు మీదనే సంబురాలు చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

– ఇస్లీవాల రాజు, పురానాపూల్

ఇంటి పన్ను తగ్గించాలని వినతి



సీడీఎంఏ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్‌లో పెంచిన ఇంటి పన్ను తగ్గించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మీర్‌పేట–1,2 అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్‌లు సీడీఎంఏ (కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అధిక ఇంటి పన్నులతో ప్రజలపై భారం పడుతోందని, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. దీనికి సీడీఎంఏ సానుకూలంగా స్పందించారని నేతలు తెలిపారు. పన్ను తగ్గించని పక్షంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, సూల ప్రభాకర్, ధ్యాసాని తిరుపతిరెడ్డి, కాశీరాం యాదవ్ పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తాం

ఏఎంసీ ఛైర్మన్ సభావత్ కృష్ణానాయక్



కృష్ణానాయక్, చాకలి యాదయ్యను సన్మానిస్తున్న నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మార్కెట్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సభావత్ కృష్ణానాయక్, వైస్ ఛైర్మన్ చాకలి యాదయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు లభించిందన్నారు. పదవుల కోసం తాము ఏనాడు పార్టీలు మారలేదని, పార్టీ బలోపేతం కోసం తాము నిరంతరం పనిచేశామని, తమ సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం తమకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టిందన్నారు. తమ పదవులు రావడంలో కీలకపాత్ర పోషించిన మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎర్ర చంద్రమోహన్, సీనియర్ నాయకుడు తొంట ఈశ్వర్ పలువురు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

మహేశ్వరం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ నవతకు సమస్యలతో కూడిన వినతిపత్రం ఆమెకు ఏబీవీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాల, పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలన్నారు. ఫీజుల పెంపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం పని చేస్తోందన్నారు. అంతకుముందు డిప్యూటీ తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేయడంతో, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సయీద్, శ్రీకాంత్, సాయి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ నవతకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కాముడి దహనం



కాముడి దహనం నిర్వహిస్తున్న నాయకులు

కందుకూరు: హోలీ పండుగ ముందు రోజు నిర్వహించే కాముడి దహన కార్యక్రమాన్ని మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద కాముడి దహనం చేశారు.

శ్రీరాం కాలనీ అభివృద్ధికి కృషిచేయాలి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న షేర్‌సింగ్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ 17వ వార్డులో సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని బీజేపీ సీనియర్ నాయకుడు షేర్ సింగ్ కోరారు. ఈ మేరకు గురువారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా షేర్‌సింగ్ మాట్లాడుతూ.. శ్రీరాం కాలనీలో అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నారని, ఇప్పటికీ పూర్తిస్థాయిలో సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలని వినతి

చేవెళ్ల: విద్యారంగానికి ప్రభుత్వం బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించటంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలన్నారు. టీఏఎఫ్ఆర్‌సీ తన ఫీజుల పెంపు ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

పరీక్షల వేళ యోగా ఇలా

మానసిక ఒత్తిడికి, ఏకాగ్రతకు వజ్రాయుధం

హుడాకాంప్లెక్స్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, విద్యావంతులుగా ఎదగడానికి చదువు అనేది ఒక వజ్రాయుధం లాంటిది. అలాంటి విద్యాభ్యాసంలో ముందు వరుసలో ఉండి, ఉన్నత స్థితికి వెళ్లవలసి ఉంటుంది. ఇలాంటి తరుణంలో మనసును నియంత్రించి, ఏకాగ్రతను పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి మన ఋషులు అందించిన గొప్ప జీవన విధానమే యోగా. అలాంటి జీవిన విధానంతో విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో పాఠశాలలో రోజులో కొంత సమయం చిన్నారుల చేత యోగా సాధన చేయిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. సుఖ ప్రాణాయామం, దీర్ఘ శ్వాస ప్రాణాయామం, ధ్యానం వంటి యోగా సాధన పద్ధతుల ద్వారా వారిలో ఉత్తేజాన్ని నింపుతున్నారు.



హుడాపార్కులో ప్రాణాయామం చేస్తున్న విద్యార్థులు

ఆన్‌లైన్ ద్వారా సాధన

వేసవి సెలవుల్లో బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తూ.. విద్యార్థులకు జీవనం విద్య, యోగా విద్య బోధిస్తున్నామని ప్రముఖ యోగా గురువు స్వధర్మయోగి ఇస్మాయిల్ గురుజీ తెలిపారు. పరీక్షల ఒత్తిడితో ఉన్నవారికి ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా యోగా సాధన చేయిస్తున్నామని చెప్పారు. మే నెలలో బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

‘ఫ్యూచర్ సిటీలో మా గ్రామాలను చేర్చండి’



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కందుకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాలను చేర్చాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధి శ్రీశైలం రహదారిపై నేదునూరు గేట్ వద్ద అఖిల పక్ష నాయకులతో కలిసి 9 గ్రామాల ప్రజలు ధర్నా చేశారు. అనంతరం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, పులిమామిడి, ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్, దావూద్‌గూడతండా, పెద్దమ్మతండాలకు చెందిన అఖిల పక్ష పార్టీల నాయకులు మాట్లాడారు. కందుకూరు మండలంలోని 26 గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపి, తమ గ్రామాలను విస్మరించడం బాధాకరమన్నారు. తమ గ్రామాలను కూడా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తేవాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మీర్‌పేట: 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని మీర్‌పేట కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్ సూచించారు. జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాదాపు 250 మంది 10వ తరగతి విద్యార్థులకు అనిల్‌యాదవ్ గురువారం తన సొంత ఖర్చులతో ప్యాడ్లు, పెన్నులు, స్టేషనరీని అందజేశారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులు కావాలని ఈ సందర్భంగా అనిల్‌యాదవ్ ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 10 మందికి తన కళాశాలలో ఉచితంగా ఇంటర్ విద్యను అందిస్తానని, దీంతో పాటు ముగ్గురికి ఆర్థిక సహాయం అందజేస్తానని వాగ్దేవి కళాశాల ఛైర్మన్ సిద్దాల బీరప్ప హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక నాయకులు జెటావత్ శ్రీనునాయక్, దోమలపల్లి రాజ్‌కుమార్, మాదరి రమేశ్, సిద్దాల అంజయ్య, బలరాం, లయన్స్ క్లబ్ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

కందుకూరు: తొలి తెలుగు కవయిత్రి మాతృశ్రీ కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని మండల కుమ్మర సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఆమె విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి, తుక్కుగూడ కౌన్సిలర్ భావన మాట్లాడారు. 16వ శతాబ్దపు తొలి తెలుగు కవయిత్రిగా తెలుగులో ఆమె రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. ఆమెను కుమ్మర కులస్తులతో పాటు తెలుగు వారందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం మహేశ్వరం అధ్యక్షుడు ఎం.రాజు, మహిళా అధ్యక్షురాలు ఎస్.జయమ్మ, మాజీ సర్పంచ్ కె.సురేశ్, యూత్ ప్రెసిడెంట్ ఎగిరిశెట్టి నరేశ్, సంఘం నాయకులు ఎ.జంగయ్య, ఎ.రాజు, మధు, సురేశ్, నర్సింహ, లింగమయ్య, అంజయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



కవయిత్రి మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుమ్మర సంఘం నాయకులు

వేడుకల్లో సహజ రంగులే వాడాలి



పేదలకు రంగులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ అనిత

హుడాకాంప్లెక్స్: హోలీ వేడుకల్లో ప్రతి ఒక్కరూ సహజ సిద్ధమైన రంగులనే వాడాలని సరూర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్‌రెడ్డి సూచించారు. గురువారం సరూర్‌నగర్‌లో మహిళా అవేర్‌నెస్ రిసోర్స్ సొసైటీ (మార్స్) ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా చేపట్టిన సహజ సిద్ధమైన రంగుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులు, మహిళలకు రంగులను అందజేశారు. పండుగ పేద ప్రజల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరికి సమస్యలు, ఇబ్బందులు ఉంటాయని, వాటి నుంచి దూరం కావడానికి ఇలాంటి పండుగలు చేసుకుంటూ జీవితాలను అందంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఎంఈఓ మనోహర్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైన మెట్టు అన్నారు. పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దని, భయాన్ని వీడి పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏఐఎస్ఎఫ్ నాయకులు చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. ఉపాధ్యాయులు శైలజ, శంకరయ్య పాల్గొన్నారు.